సాక్షి
బాపట్ల
సోమవారం । 24 । ఫిబ్రవరి । 2025



### శ్రీవారికి పవళింపు సేవ

బాపట్ల : శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి స్వామి వారికి 16వ రోజు పండుగ సందర్భంగా పవళింపు సేవ చేపట్టారు.



### సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 533.40 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,067 క్యూసెక్కులు విడుదలవుతోంది.



### దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): మాఘ మాసం ఆఖరి ఆదివారం నేపథ్యంలో ఇంద్ర కీలాద్రిపై భక్తుల రద్దీ కనిపించింది. తెల్లవారు జాము నుంచి ప్రాంగణం కిటకిటలాడింది.

# అన్నీ ఆలపాటి వర్గీయులకేనా...?

కృష్ణా – గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల శాసనమండలి స్థానానికి పోటీ పడుతున్న కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్న చందంగా తయారైంది. కూటమి సర్కారులో పెత్తనం చలాయిస్తున్న సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం, రెండు జిల్లాల్లో అన్నింటా ఆ వర్గీయులకే ప్రథమ ప్రాధాన్యం దక్కుతుండటం అంతటా చర్చనీయాంశాలు అయ్యాయి. ప్రధాన పోటీదారుడైన పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావుతో ఆలపాటి వ్యక్తిత్వం, అభ్యర్థిత్వం, నాయకత్వం, రాజకీయతత్వం తదితరాలను పట్టభద్రులైన ఓటర్లు బేరీజు వేసుకున్నప్పుడు ఎవరివైపు మొగ్గుతారనే అంతర్మథనం కూటమి వర్గాల్లో జరుగుతోంది. మరో వైపు సర్కారు వైఫల్యాలు కూటమి అభ్యర్థికి శాపాలుగా మారతాయనే ఆందోళన అధికమవుతోంది.

- గుంటూరు నుంచి ముగ్గురు మంత్రులు
- ఏడుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు సైతం
- కృష్ణాలో ఆరుగురు ఎమ్మెల్యేలు, ఎంపీ
- అయినప్పటికీ ఆ సామాజిక వర్గానికే టీడీపీలో ప్రాధాన్యం
- శాసన మండలి ఎన్నికల్లో ప్రధాన చర్చనీయాంశమిదే
- గత సర్కారు హయాంలో ఈ పరిస్థితుల్లేవని విశ్లేషణ
- కూటమి అభ్యర్థికి తలపోటుగా మారిన 'సామాజికం'
- ప్రభుత్వ వైఫల్యాలు మొదటికే మోసమంటూ హైరానా



సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: అసెంబ్లీ ఎన్నికల్లో తెనాలి నుంచి ఆలపాటికి సీటు ఇవ్వకుండా కూటమి పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన సంగతి తెలిసిందే. సీటు త్యాగం చేశారనే మండలి ఎన్నికల్లో అవకాశం కల్పించినట్లు ఆ పార్టీ అధిష్ఠానం చెబుతోంది. ఇదే పరిస్థితి ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని 33 అసెంబ్లీ, 5 లోక్‌సభ (బాపట్ల, ఏలూరు పాక్షికం) స్థానాల్లో టికెట్లు ఆశించి భంగపడిన వారిలో ఇతర సామాజిక వర్గాలకు చెందిన నాయకులకు లేక పోలేదు. 'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ కోసం మేం కష్టపడిన తీరు తెలుసు. మమ్మల్ని పార్టీ ఎలా వాడుకుందో కూడా తెలుసు. కొన్ని దాడులను ఎదుర్కొన్నాం. కేసులు నమోదు చేశారు. అయినా మా 'త్యాగం' గుర్తుకు రాకపోవడం బాధాకరం. మేం వారి సామాజిక వర్గీయులం కాకపోవడమే ఇందుకు కారణం కదా' అనే ఆవేదన కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని బీసీ, ఓసీ నాయకులలో లేకపోలేదు.

**సింహభాగం అవకాశాలు, పదవులు వారికేనా...**

కృష్ణా, గుంటూరు జిల్లాలలో అధికభాగం అవకాశాలు, పదవులు చంద్రబాబు సామాజిక వర్గీయులకే దక్కుతున్నాయని, ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీ అవకాశం ఇతర వర్గీయులకు ఎందుకు ఇవ్వడం లేదనే ప్రశ్న పార్టీ నాయకులలో ఆది నుంచీ ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీల్లోనూ ముఖ్య నాయకులు లేకపోలేదని గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు ఇదే ఆలపాటికి అంతర్లీనంగా ప్రధాన అవరోధంగా మారనుందని రాజకీయ పరిశీలకుల అంచనా.

ఇటు గుంటూరు జిల్లా నుంచి నారా లోకేష్, నాదెండ్ల మనోహర్ (జనసేన), కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌లు ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి సామాజిక వర్గీయులేనని గుర్తుచేస్తున్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, ధూళిపాళ్ల నరేంద్ర, జీవీ ఆంజనేయులు, యరపతినేని శ్రీనివాసరావు, భాష్యం ప్రవీణ్... వీరందరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడం గమనార్హం. అటు కృష్ణా జిల్లాలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), గద్దె రామ్మోహన్, యార్లగడ్డ వెంకట్రావు, బోడె ప్రసాద్, వెనిగండ్ల రాము, వసంత కృష్ణప్రసాద్, కూటమిలోని సుజనాచౌదరి, కామినేని శ్రీనివాస్, నాదెండ్ల మనోహర్‌లు సైతం ఆలపాటి సామాజిక వర్గీయులని పరిశీలకులు వివరిస్తున్నారు. 'ఏమండీ అన్ని పదవులు మీ వారికేనా. ఇంకెవరూ అర్హులు లేరా? చిన్న పదవులు ఇతరులకు విదిల్చి ముఖ్యమైనవన్నీ మీకేనా' అని ఓటరు ప్రశ్నించినట్టు ప్రచారంలో పాల్గొన్న ఆలపాటి వర్గీయుడు తెలిపారు.

**వైఎస్సార్‌సీపీ హయాంలో ...**

వైఎస్సార్‌సీపీ హయాంలో గుంటూరు, కృష్ణా జిల్లాల్లో పదవుల పంపకాలలో ఇతర సామాజిక వర్గాలకు దక్కిన ప్రాధాన్యతను పట్టభద్రులు గుర్తుచేయడం టీడీపీ నాయకులకు మింగుడు పడడం లేదని సమాచారం. గుంటూరు జిల్లా నుంచి మేకతోటి సుచరిత, మోపిదేవి వెంకటరమణ, మేరుగ నాగార్జున, అంబటి రాంబాబు, విడదల రజని, కృష్ణా జిల్లా నుంచి కొడాలి శ్రీ వేంకటేశ్వరరావు (నాని), పేర్ని వెంకట్రామయ్య (నాని), వెలంపల్లి శ్రీనివాస్, జోగి రమేష్ మంత్రులుగా వ్యవహరించారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు వంటి పదవులు ఇతర సామాజిక వర్గాలకు చెప్పుకోదగిన స్థాయిలో దక్కడాన్ని పరిశీలకులు గుర్తు చేసుకుంటున్నారు. ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు వంటి సీనియర్ నేతలకు కూడా సముచిత ప్రాధాన్యం దక్కింది.

**ఆందోళన కలిగిస్తున్న కూటమి వైఫల్యాలు**

సూపర్ సిక్స్ హామీల అమలు, ఇతర ప్రభుత్వ వైఫల్యాలన్నీ కూటమి అభ్యర్థికి ఆందోళన కలిగిస్తున్నాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు ఇచ్చిన హామీలు హుళక్కే. నిరుద్యోగులకిచ్చిన మాటలు నీటిమూటలయ్యాయి. రైతుల సంగతి సరేసరి. అన్ని రంగాలు, అన్ని వర్గాల నుంచి పట్టభద్రులు ఓటర్లుగా ఉన్న నేపథ్యంలో 'ఆలపాటి పరిస్థితి ఏంటి' అనేది అందరి నోటా వినిపిస్తున్న నేటి మాట.

## ప్రశాంతంగా గ్రూప్–2 మెయిన్స్

**జిల్లాలో 85.45 శాతం హాజరు**



గుంటూరు ఏసీ కళాశాలలో పరీక్ష రాయడానికి వస్తున్న అభ్యర్థులు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్) / గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్–2 మెయిన్స్ ఆదివారం జరిగింది. పేపర్–1, పేపర్ –2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 9,277 మంది అభ్యర్థులకుగాను పేపర్–1కు 7,927 మంది, మధ్యాహ్నం పేపర్–2కు 7,920 మంది హాజరయ్యారు. మొత్తమ్మీద 85.45 శాతం హాజరు నమోదైంది. జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ వట్టిచెరుకూరు మండలంలోని పుల్లడిగుంట గ్రామంలో ఉన్న మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు.

ప్రత్తిపాడు నియోజకవర్గం వ్యాప్తంగా 5,793 మందికిగాను 4,822 మంది హాజరయ్యారు. పలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల కళాశాల, విజ్ఞాన్ డిగ్రీ కళాశాల, ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల, జీవీఆర్‌ఎస్ ఇంజినీరింగ్ కళాశాల, ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల, మలినేని లక్ష్మయ్య ఇంజినీరింగ్ కళాశాల, కిట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాలలో అభ్యర్థులు పరీక్షలు రాశారు.



పుల్లడిగుంటలోని పరీక్షా కేంద్రంలో పరిశీలిస్తున్న జేసీ ఎ. భార్గవ్ తేజ

## న్యూస్‌రీల్

### పెండ్లికుమారుడైన అమరేశ్వరుడు



అమరావతి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అమరావతి శ్రీబాల చాముండికా సమేత అమరేశ్వర స్వామి వారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం అర్చకులు అమరేశ్వరుడిని, బాల చాముండేశ్వరి దేవిని పెండ్లి కుమారునిగా, పెండ్లి కుమార్తెగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు కై తేపల్లి సుధీర్‌శర్మ ఆధ్వర్యంలో శివరాత్రి కళ్యాణ మహోత్సవంలో భాగంగా ఆదివారం ఈ కార్యక్రమాలు ప్రారంభించారు. తొలుత ఆలయ అనువంశిక ధర్మకర్తల మండలి చైర్మన్ రాజావాసిరెడ్డి మురళీకృష్ణ ప్రసాద్ తరఫున పీసపాటి అమరేశ్వర శర్మ నేతృత్వంలో స్వామి వారికి మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి కళ్యాణోత్సవ వస్త్రాలను సమర్పించారు. స్వామి వారికి వేకువజామున అభిషేకం నిర్వహించి, నూతన వస్త్రధారణతో పెండ్లికుమారుడిని చేశారు. క్రోధినామ సంవత్సర మాఘ బహుళ దశమి నుంచి ఫాల్గుణ శుద్ధ పాడ్యమి వరకు పాంచాహ్నిక దీక్షతో నిర్వహించే ఈ కళ్యాణోత్సవాలకు అర్చకులకు ఆలయ కార్య నిర్వాహణాధికారి సునీల్‌కుమార్ దీక్షా వస్త్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### హైవేపై వాటర్ ట్యాంకర్ బోల్తా



విజయపురిసౌత్: ఎదురుగా వస్తున్న గేదెలను తప్పించబోయి వాటర్ ట్యాంకర్ హైవేపై బోల్తా పడిన సంఘటన మాచర్ల మండలం భైరవునిపాడు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మాచర్ల నుంచి నీటిని నింపుకొని 7వ మైలుకు వెళ్తున్న వాహనం సరిగ్గా భైరవునిపాడు వద్దకు రాగానే గేదెలు అడ్డు రావడంతో అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. అనంతరం క్రేన్‌తో రోడ్డుకు అడ్డుగా పడ్డ వాహనాన్ని తొలగించారు. డ్రైవర్ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు.

### శివరాత్రికి పటిష్ట బందోబస్తు



అమరావతి: మహాశివరాత్రి ఉత్సవాలలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని సత్తెనపల్లి డీఎస్పీ ఎం. హనుమంతరావు తెలిపారు. స్థానికంగా శివరాత్రి ఏర్పాట్లను, భద్రత కల్పించాల్సిన స్థలాలను ఆదివారం ఆయన పరిశీలించారు. సుమారు 150 మంది సిబ్బంది, 20 మంది అధికారులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. డీఎస్పీ వెంట అమరావతి సీఐ అచ్చియ్య, ఎస్ఐ రాజశేఖర్ ఉన్నారు.

### రుద్రాక్ష వాహనంపై మల్లేశ్వరుడు



మంగళగిరి టౌన్: మంగళగిరిలోని శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం 6వ రోజు స్వామి వారు రుద్రాక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మహేష్ కుమార్ శర్మ, శ్యామ సుందర శాస్త్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. పట్టణానికి చెందిన ఉదయ్ శ్రీనివాస్, మురళీకృష్ణ, ఉదయ కుమార్, శ్రీరంగ సత్యనారాయణ, బాలగంగాధర్‌గుప్తా, శివమోహన్‌మూర్తి, సురేంద్రబాబు, పెదబాబు, శివప్రసాదరావుగుప్తా, రవీంద్రనాథ్‌గుప్తా, అశ్వనీ కుమార్, గోపాలకృష్ణ, మధుసూదన వెంకట సుబ్బారావు, చెన్న కేశవ శేషగిరిరావు ఉత్సవ కైంకర్యపరులుగా వ్యవహరించారు. దేవస్థాన ఈవో జె.వి. నారాయణ ఉత్సవ నిర్వహణను పర్యవేక్షించారు.

## శివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం





పెండ్లి కుమార్తె అలంకరణలో భ్రమరాంబ , దర్శించుకుంటున్న భక్తులు

పెదకాకాని: స్థానిక మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. భ్రమరాంబ అమ్మవారు పెండ్లి కుమార్తె అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సుప్రభాత సేవ, పంచహారతులు, రుద్రాభిషేకం, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, దీక్షాధారణ, త్రిశూలపూజ, వాస్తుపూజ, ధ్వజారోహణ, ఆలయ బలిహరణ తదితర కార్యక్రమాలు ఘనంగా సాగాయి. స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చకులు పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాదులు ఈ కార్యక్రమాలను ఆలయ ఉప కమిషనరు గోగినేని లీలా కుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు పొంగళ్లు పొంగించి స్వామి వారికి నైవేద్యం పెట్టారు. పెదకాకాని భవానీ భక్త సమాజం వారిచే భజన కాలక్షేపం, విజయవాడకు చెందిన ప్రణతి కూచిపూడి నృత్యం, శివశక్తి నాట్యమండలి, పెద్దపల్లి వారిచే శ్రీ వల్లీ కళ్యాణం నాటకం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సోమవారం అమ్మవారు వనదుర్గాదేవి అలంకారంలో దర్శనమివ్వనున్నారు.

## ఘనంగా ప్రారంభమైన
# కోటప్పకొండ తిరునాళ్ల





క్యూలైన్‌లో భక్తుల రద్దీ , ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వరుడు

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ తిరునాళ్ల మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. త్రికోటేశ్వర స్వామి వారికి తెల్లవారు జామున ఆలయ అర్చక స్వాములు శాస్త్రోక్తంగా విశేష అభిషేకాలు, ప్రత్యేక పుష్పాలంకరణ సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా మూలవిరాట్ అభిషేకాలు రద్దు చేశారు. అభిషేక మండపంలో నిర్వహించిన అభిషేకాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వీరికి ప్రత్యేక దర్శనాన్ని కల్పించారు. ధ్యానశివుడు, నాగేంద్రుని పుట్ట వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. సోపాన మార్గంలో మెట్ల పూజ నిర్వహిస్తూ భక్తులు కొండమీదకు చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. మెట్ల మార్గంలో తాగునీటి సౌకర్యం కల్పించకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే ప్రధాన ఆలయం చుట్టూ నీడ కోసం టెంట్లు వేసే పనులు పూర్తికాక పోవడంతో ఎండ వేడిమికి మహిళలు, వృద్ధులు అవస్థలు పడ్డారు. ధ్యాన శివుడుకు రంగులు వేసే పనులు పూర్తికాలేదు. సెంట్రింగ్ కర్రల మధ్య నుంచే వెళ్లి భక్తులు పూజలు నిర్వహించాల్సి వచ్చింది. వృద్ధులు, వికలాంగులను బ్యాటరీ కారులో పార్కింగ్ నుంచి ప్రధాన ఆలయ ప్రాంగణం వద్దకు తీసుకువచ్చే ఏర్పాటు చేశారు. నరసరావుపేట నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడిపింది. పట్టణ, పరిసర గ్రామాల నుంచి భక్తులు బాలప్రభలతో కొండకు వచ్చారు. ఆలయ ఈవో డి.చంద్రశేఖరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఘాట్‌రోడ్డు మార్గంలోని ప్రకృతి పర్యావరణ కేంద్రం వద్ద యాత్రికుల సందడి నెలకొంది.

**నేడు, రేపు అన్నప్రసాద వితరణ**

నరసరావుపేట రూరల్: కొండకు వచ్చే భక్తులకు సోమ, మంగళవారాల్లో అన్నప్రసాద వితరణ ఉంటుందని గిరి ప్రదక్షిణ సేవా సమితి అధ్యక్షుడు అనుమోలు వెంకయ్యచౌదరి ఆదివారం తెలిపారు.

# సర్కారు జాగా.. యథేచ్ఛగా పాగా!

- రాత్రికి రాత్రే గుడిసెలు ఏర్పాటు
- రంగంలోకి రెవెన్యూ, పోలీస్ అధికారులు
- తొలగింపును అడ్డుకున్న కబ్జాదారులు
- ముగ్గురు ఆత్మహత్యాయత్నం
- బాధితులు ఆసుపత్రికి తరలింపు
- ఎట్టకేలకు గుడిసెలు తొలగింపు



మండలంలోని వెస్ట్ బాపట్ల పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన గుడిసెలు

బాపట్ల టౌన్: పేదల అభ్యున్నతి కోసం నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో మండలంలోని వెస్ట్ బాపట్ల పంచాయతీ పరిధిలోని వైఎస్సార్ కాలనీ సమీపంలో ప్రభుత్వ భూమిని పేదలకు కేటాయించారు. సర్వే నెంబర్ 408, 203, 207, 208, 209లలో సుమారు 6 ఎకరాలు ఇక్కడ ఉంది. దానిలో జగనన్న కాలనీ లే అవుట్ వేసి 118 మంది పేదలకు ఇళ్లపట్టాలు కూడా సిద్ధం చేశారు. ప్రస్తుతం ఆ పట్టాలు తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారుల పేరుతో ఉన్నాయి. 2024లో ఎన్నికల కోడ్ రావడం, అదే ప్రాంతానికి చెందిన కొందరు కోర్టుకు వెళ్లడంతో పట్టాల పంపిణీ నిలిచిపోయింది. ఈ స్థలం హైవేకు ఆనుకొని ఉండటంతో రూ.కోట్ల విలువ చేసే భూమిపై కన్నేసిన టీడీపీ నాయకులు కబ్జాకు తెరతీశారు.

**బలవంతంగా తొలగింపు**

శనివారం అర్ధరాత్రి ప్రభుత్వ స్థలంలో గుడిసెలు ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు ఆదివారం సాయంత్రం అక్కడకు చేరుకున్నారు. గుడిసెలు తొలగించాలని కబ్జాదారులను హెచ్చరించారు. ఎంతసేపటికీ వినకపోవడంతో అధికారులు బలవంతంగా గుడిసెలు ఖాళీ చేయించారు. వాటి ఏర్పాటుకు ఉపయోగించిన కలప, పట్టలను ట్రాక్టర్‌లో తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. కబ్జాదారులు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి కబ్జా చేసి శాశ్వత భవనాలు నిర్మించుకున్న వారిని ఎందుకు ఖాళీ చేయించడం లేదన్నారు.



కబ్జాదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో పి. గ్లోరియా, తహసీల్దార్ షేక్ సలీమా



పురుగుమందు తాగేందుకు ప్రయత్నిస్తున్న మహిళను అడ్డుకుంటున్న పోలీసులు

ఇటీవల సర్వేనెంబర్ 207, 208 పరిధిలో ప్రభుత్వ భూమిని పేదలకు లాటరీ పద్ధతిలో స్థానిక టీడీపీ నాయకులు ఒక్కో ప్లాట్‌కు రూ. 20 వేలు తీసుకొని ఇచ్చినప్పుడు మీరంతా ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు.

పేదలమైన తాము గుడిసెలు వేసుకుంటే తొలగిస్తారా అంటూ నాగేంద్రపురం గ్రామానికి చెందిన ఆట్ల కృష్ణారెడ్డి, గోసంద్రం వెంకటరత్నం, జక్కిరెడ్డి జానకీలు పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన పోలీసులు వారిని అడ్డుకొని చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.

**ఆక్రమిస్తే కఠిన చర్యలు**

ఆర్డీవో పి.గ్లోరియా మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఇదే ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరికి పంచిన విషయం తమకు తెలియదన్నారు. అధికారికంగా తాము ఏ ఒక్కరికీ పట్టాలు ఇవ్వలేదని చెప్పారు. పైగా ఈ స్థలం విషయం కోర్టు పరిధిలో ఉందని గుర్తుచేశారు. ఈ స్థలంలో ఎలాంటి కట్టడాలు చేపట్టినా, ఆక్రమించినా వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒక్కొక్కరి వద్ద నుంచి రూ. 20 వేలు వసూలు చేసి స్థలాన్ని కేటాయించిన వారిపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అర్హులైన పేదలు ఉంటే ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలేగానీ ఇష్టానుసారంగా కబ్జాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. గుడిసెలు తొలగించే కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ సలీమా, రూరల్ సీఐ కె. శ్రీనివాసరావు, ఎస్ఐ శ్రీనివాసరావు, వీఆర్వోలు, పోలీసులు పాల్గొన్నారు.

# వారబందీ అమలు నిర్ణయం ఉపసంహరించుకోండి

- లేనిపక్షంలో రైతులకు తీవ్ర అన్యాయం
- ఎకరాకు రూ.20 వేలు వరకు నష్టం
- వైఎస్సార్‌సీపీ రైతు విభాగ జిల్లా అధ్యక్షులు



అన్నెం పున్నారెడ్డి

నరసరావుపేట: నాగార్జున సాగర్ కుడి కాలువ ఆయకట్టు పరిధిలో వారబందీ అమలు వల్ల రెండో పంట సాగు చేసిన రైతులకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగ జిల్లా అధ్యక్షులు అన్నెం పున్నారెడ్డి పేర్కొన్నారు. వెంటనే ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 28వ తేదీ నుంచి వారబందీ అమలు చేస్తామని అధికారులు పేర్కొన్న విషయం విదితమే. దీనిపై ఆయన స్పందిస్తూ.. ఇప్పటికే సాగర్ ఆయకట్టు కింద రైతులు రెండో పంటగా మొక్కజొన్న, వరి, మినుము, పెసరను వేల ఎకరాలలో సాగు చేశారని పేర్కొన్నారు. వారబందీ అమలు విషయం డిసెంబర్ మొదటి వారంలో అధికారులు చెప్పి ఉంటే రైతులు రెండో పంటపై నిర్ణయం తీసుకొని ఉండేవారన్నారు. వారు రెండో పంట వేసుకున్నాక ఇప్పుడు ప్రకటన చేయటం వల్ల రైతులకు ఎకరానికి రూ.20 వేలు నష్టం వస్తుందన్నారు. వారబందీగా సాగునీరు ఇవ్వాలనుకుంటే ఎకరానికి రూ.25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని పున్నారెడ్డి డిమాండ్ చేశారు. ఏప్రిల్ 30వ తేదీ వరకు ఎలాంటి వారబందీ లేకుండా సంపూర్ణంగా సాగునీరు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెనాయుడులను కోరారు. లేదంటే రైతుల తరఫున వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని హెచ్చరించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు సోదరులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సాగునీరు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అంతేగాకుండా రైతులకు తగిన గిట్టుబాటు ధర కల్పించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చి తర్వాత గిట్టుబాటు ధర లేక మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని గుర్తుచేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోకపోతే తమ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని సంప్రదించి రైతు మహాధర్నా చేపడతామని హెచ్చరించారు.

# టూరిస్టు మాస్టారు!

- వృత్తి ఉపాధ్యాయుడు.. ప్రవృత్తి యాత్రలు
- దేశంలోని వివిధ ప్రాంతాలను తన బైక్‌పై చుట్టివచ్చిన వైనం
- రిటైర్‌మెంట్ అనంతరం దేశమంతా చుట్టిరావడమే జీవితలక్ష్యం

**యడ్లపాడు:** భావిపౌరులను ఉత్తములుగా తీర్చిదిద్దే తనలో మరో టాలెంట్ ఉందని నిరూపించుకుంటున్నారు ఓ ఉపాధ్యాయుడు. 58 ఏళ్ల వయసులో పలు ప్రదేశాలను బైక్‌పై చుట్టేసి రావడమే ఆ మాస్టారి ప్రత్యేకత. ఆయనే పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం లింగారావుపాలెం జెడ్పీ హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న ఫిజిక్స్ మాస్టర్ దారపురెడ్డి రామాంజనేయులు.

### 125 సీసీ బైక్‌తోనే..

ప్రస్తుతం గుంటూరులో నివాసం ఉంటున్న రామాంజనేయులు వృత్తి జీవితంలో సక్సెస్‌ఫుల్ ఉపాధ్యాయుడిగా పేరుతెచ్చుకున్నారు. పాఠశాలకు ఇచ్చే సెలవులను సద్వినియోగం చేసుకుంటూ పర్యటకానికి పరుగులు దీస్తారు. దేశంలోని అనేక రాష్ట్రాలు, సరిహద్దుల్ని సైతం రామాంజనేయులు తన 125 సీసీ బైక్‌పై పర్యటించడం విశేషం. గత


హిమాలయాల్లోని జోజిల్లా పాస్ వద్ద రామాంజనేయులు



ప్రపంచంలో ఎత్తయిన ఖర్దుంగ్లా ప్రవేశ మార్గంలో జాతీయ జెండాతో..

నాలుగేళ్ల కాలంలో పాకిస్తాన్, చైనా సరిహద్దు భాగాల్లోని అటారీ బోర్డర్, ప్యాంగ్‌గ్యాంగ్ లేక్, ఢిల్లీ, అమృతసర్, శ్రీనగర్, కార్గిల్ వార్ మెమోరియల్, మనాలీ యాత్ర చేశారు. సముద్ర మట్టం నుంచి 17,982 అడుగుల ఎత్తున ఉన్న పర్వత శిఖరాలపైకి బైక్‌మీద వెళ్లాడు. కర్ణాటక, కేరళ, తెలంగాణ రాష్ట్రాల్ని పలుమార్లు చుట్టేశాడు.

- యాత్రల్లోనే సుదీర్ఘ విశ్రాంతి లభించడంతో ఉడిపిలోని అన్నపూర్ణేశ్వరి ఆలయం, ప్రయోగ కుంభమేళా, యాగంటి, జోగులాంబ, శ్రీశైలం మల్లికార్జున, తిరుపతి వేంకటేశ్వర స్వామి, కాణిపాకం సిద్ధి గణపతి, కర్ణాటకలోని అంబాబాయిగా పిలిచే మహాలక్ష్మి, అమృతసర్‌లోని గురుద్వార్ ఆలయాలను తన బైక్‌పైనే ఆయన సందర్శించారు.

**దేశమంతా బైక్‌పై చుట్టిరావడమే లక్ష్యం**

దేశంలోని వివిధ ప్రాంతాల్లోని జీవన విధానం, సాంస్కృతిక వారసత్వం, చారిత్రక అంశాలు ఒక కొత్త అనుభూతిని కలిగిస్తాయి. సెలవుల కాలమంతా యాత్రలోనే గడుపుతాను. ఆయా అంశాలను సహోపాధ్యాయులకు, విద్యార్థులకు తెలియజేస్తాను. అక్కడి వీడియోలను చూపిస్తూ అవగాహన కల్పిస్తాను. రిటైర్‌మెంట్ అనంతరం దేశమంతా చుట్టిరావడమే నా ఏకైక లక్ష్యం.

– డి రామాంజనేయులు

# కళకళలాడిన ఎర్రకొండ

- ముగిసిన యడ్లపాడు రహదారి మాత మహోత్సవాలు
- మూడు రోజులు వేలాదిగా విశ్వాసుల హాజరు

**యడ్లపాడు:** స్థానిక హైవే పక్కన ఎర్రకొండపై ఉన్న రహదారిమాత పుణ్యక్షేత్రంలో మూడు రోజులుగా కొనసాగిన తృతీయ వార్షిక మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. శుక్రవారం ప్రారంభమైన ఈ వేడుకలు ప్రతిరోజూ సాయంత్రం 6:30 గంటల నుంచి అర్ధరాత్రి వరకు కోలాహలంగా జరిగాయి. ఆర్‌సీఎం చర్చి ఫాదర్, పుణ్యక్షేత్ర రెక్టార్ కె బాలసుభాష్ చంద్రబోస్ నేతృత్వంలో స్తుతి ఆరాధన, స్వస్థత ప్రార్థన, దివ్య బలిపూజ, వాక్య పరిచర్యలు నిత్యం కొనసాగాయి. కార్యక్రమంలో సమీప గ్రామాల విశ్వాసులతోపాటు సుదూర ప్రాంత వాసులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

**కొండపైకి ఘాట్‌రోడ్డు ఏర్పాటు..**

ఇప్పటి వరకు మెట్ల మార్గం ఉండగా, వాహనాల రాకపోకలకు అనుకూలంగా కొండపైకి నూతనంగా ఘాట్‌రోడ్డు, కొండపై రహదారి మాత విశ్రాంతి భవనం నిర్మించారు. వీటిని బిషప్ డాక్టర్ చిన్నాబత్తుని భాగ్యయ్య ఆదివారం రాత్రి ప్రారంభించారు. అనంతరం సమష్టి గురువుల ఆధ్వర్యంలో జరిగిన రహదారి మాత పూజాబలి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలకు విచ్చేసిన వేలాది మంది విశ్వాసులకు మూడురోజులపాటు అన్నదానం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.


బిషప్ డాక్టర్ చిన్నాబత్తుని భాగ్యయ్య విచారణ గురువులతో కలిసి దివ్య పూజాబలి నిర్వహిస్తున్న దృశ్యం

**తపఃకాల ఏడు ప్రత్యేక శుక్రవారాలు...**

వేడుకల అనంతరం మార్చి నుంచి ఏప్రిల్ వరకు ఏడు శుక్రవారాలు (మార్చి 7, 14, 21, 28, ఏప్రిల్ 4, 11, 18) సిలువ మార్గం, జపమాల, దివ్య బలిపూజ, వాక్యపరిచర్యలు నిర్వహించనున్నట్లు ఫాదర్ వెల్లడించారు. కార్యక్రమాలకు ఫాదర్లు అల్లం మనోజ్‌రెడ్డి, అనిల్, గోపు జోసఫ్‌రెడ్డి, ఆకుల ధర్మరాజు, కొమ్మతోటి అమృత్, కొచ్చర్ల జ్యోతిరాజు హాజరవుతారని తెలిపారు. చివరి శుక్రవారం ఏప్రిల్ 18న ఉదయం 7గంటలకు జాలాది, లింగారావుపాలెం, మైదవోలు, ఉప్పరపాలెం గ్రామాల నుంచి యడ్లపాడు వరకు పాదయాత్ర చేపట్టనున్నారు. మధ్యాహ్నం 2:30 గంటలకు స్థానిక ఆర్‌సీఎంచర్చ్ నుండి రహదారి మాత క్షేత్రానికి పవిత్ర సిలువయాత్ర నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు కొండపై సిలువ సాంగాలు, సిలువ ఆరాధన, సిలువ ముద్దు, దీక్ష విరమణ కార్యక్రమాలతో ముగించనున్నారు. ఈ కార్యక్రమాలకు అధిక సంఖ్యలో హాజరై రహదారి మాత ఆశీస్సులు పొందాలని కోరారు.


చివరిరోజు కార్యక్రమానికి హాజరైన విశ్వాసులు

## క్లుప్తంగా

### చర్లపల్లి-దానాపూర్ ప్రత్యేక రైలు

**లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్):** చర్లపల్లి-దానాపూర్ మధ్య ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చర్లపల్లి-దానాపూర్(07753) రైలు గుంటూరు డివిజన్ మీదుగా నడుస్తుందని తెలిపారు. ఈ రైలు చర్లపల్లి స్టేషన్ నుంచి సోమవారం ఉదయం 9.30 గంటలకు బయలుదేరి రెండో రోజు అర్ధరాత్రి 2 గంటలకు దానాపూర్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. దానాపూర్-చర్లపల్లి(07754) స్టేషన్ మీదుగా ప్రత్యేక రైలు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ రైలు దానాపూర్ స్టేషన్ నుంచి మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరి చర్లపల్లి స్టేషన్‌కు రెండో రోజు ఉదయం 8.15 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. ఈనెల 25వ తేదీన చర్లపల్లి-దానాపూర్(07755) రైలు గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైలు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ రైలు చర్లపల్లి స్టేషన్ నుంచి ఉదయం 9.30 గంటలకు బయలుదేరి రెండో రోజు తెల్లవారు జామున 2గంటలకు దానాపూర్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. దానాపూర్-చర్లపల్లి(07756) రైలు దానాపూర్ స్టేషన్ నుంచి మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరి రెండో రోజు ఉదయం 8.15 గంటలకు చర్లపల్లి స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ జంక్షన్, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట జంక్షన్, కొత్తవలస, విజయనగరం జంక్షన్, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బరంపూర్ స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

### తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలన



**రేపల్లె రూరల్:** మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని అరవపల్లిలో వేంచేసియున్న శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో జరగనున్న తిరునాళ్ల ఏర్పాట్లను ఆదివారం ఆలయ కార్యనిర్వహణాధికారి దివి వెంకట అప్పలాచార్యులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తిరునాళ్లను పురస్కరించుకుని ఆలయానికి రంగులు వేయటంతోపాటు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వీలుగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చలువ పందిళ్లతోపాటు బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాహనాలు నిలుపుకునేందుకు ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేశామన్నారు.

# చెరుకుపల్లిలో గుర్రం మాంసం విక్రయాలు

**గాడిద మాంసం పేరుతో అమ్మకాలు**

**చెరుకుపల్లి:** బాపట్ల జిల్లా చెరుకుపల్లిలో గుర్రం మాంసం విక్రయాలు జరుగుతున్నాయి. గాడిద పేరుతో గుర్రం మాంసాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక గాడిద రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ధర పలుకుతుండగా, ఒడిశా, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి అనారోగ్యంతో ఉన్న గుర్రాలను రూ.10 వేల నుంచి రూ.15వేలకు కొనుగోలు చేసి ఇక్కడ గాడిద మాంసం అంటూ విక్రయిస్తున్నారు. కొనుగోలుదారులకు అనుమానం రాకుండా దుకాణం ఎదుట గాడిద తలను, అవయవాలను ప్రదర్శిస్తున్నారు. కిలో రూ.600లకు విక్రయిస్తున్నారు. గతంలో ప్రజల ఫిర్యాదుతో గుంటూరు బ్లూ క్రాస్ సంస్థ సభ్యులు దాడులు నిర్వహించి 8 మందిపై కేసులు నమోదు చేశారు. ఆ సమయంలో కొంత కాలం విక్రయాలు ఆగినా తదనంతరం జరుగుతున్నాయి.


వధకు సిద్ధంగా ఉంచిన గుర్రాలు

**నివేదికను ఉన్నతాధికారులకు అందజేశాం...**

–డాక్టర్ జ్యోత్స్న, పశువైద్యాధికారి, చెరుకుపల్లి

చెరుకుపల్లిలో గాడిద పేరుతో గుర్రం మాంసం విక్రయాలు జరుగుతున్నట్లు వచ్చిన ఫిర్యాదులతో విక్రయశాలలను పరిశీలించాం. దీనిపై ప్రత్యేక నివేదికను తయారుచేసి జిల్లా ఉన్నతాధికారులకు అందజేశాం. గుర్రం మాంసం విక్రయాలు నేరం.

# వ్యవసాయ రంగం ఆధునికీకరణే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

**వ్యవసాయ సహాయ సంచాలకులు విజయ్‌బాబు**

**రేపల్లె రూరల్:** వ్యవసాయ రంగాన్ని ఆధునికీకరణ చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్.విజయ్‌బాబు తెలిపారు. మండలంలోని అరవపల్లి, ఉప్పూడి గ్రామాలలో నిర్వహిస్తున్న రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆయన పర్యవేక్షించి రైతుల నుంచి వివరాలు సేకరించారు. విజయ్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే ఈ నమోదు ప్రక్రియలో ప్రతి రైతు తమ వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. ఆధార్‌కార్డు తరహాలో ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు కార్డు అందజేస్తారని తెలిపారు. తద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలైన సీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, ఎరువుల రాయితీ పెట్టుబడిసాయం, పంటలకు కనీస మద్దతు ధర, పంటల రుణాలు, వివిధ వ్యవసాయ అనుబంధ రంగాల శాఖల సేవలు పొందవచ్చన్నారు. ప్రతి రైతు తమ రైతు సేవా కేంద్రంలో పట్టాదారు పాసుపుస్తకం, 1బీ, ఆధార్‌కార్డు, ఆధార్ కార్డుతో అనుసంధానించబడిన ఫోన్ నంబరుతో వ్యవసాయ అధికారులను కలిసి తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


రైతుల వివరాలు సేకరిస్తున్న రేపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు విజయ్‌బాబు

# 105 ఏళ్ల రాజారావు ఇక లేరు..

**తెనాలి:** పట్టణ అమరావతి ప్లాట్స్‌కు చెందిన 105 ఏళ్ల వృద్ధుడు రావులపల్లి రాజారావు ఆదివారం మృతి చెందారు. చుండూరు మండలం యడ్లపల్లికి చెందిన రాజారావు తెనాలిలో కుమారుడు ఇంట నివసిస్తున్నారు. ఆయన భార్య స్వరాజ్యలక్ష్మి చాలా కాలం కిందట మరణించారు. ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. తపాలశాఖలో సబ్ పోస్టుమాస్టర్‌గా నలభై ఏళ్లు పనిచేసిన రాజారావు ఇప్పటి వరకు ఆరోగ్యంగా ఉంటూ అందరినీ ఆశ్చర్యపరిచారు. కళ్లజోడుతో పనిలేకుండా ఇటీవల వరకు డాక్యుమెంట్లు రాస్తూ వచ్చారు. చిన్నతనం నుంచి సైకిలుపై ప్రయాణం, రోజూ కొంతసేపు నడక, దంపుడు బియ్యం ఆహారం, ఒత్తిడి లేని జీవనం తన ఆరోగ్య రహస్యాలుగా ఆయన చెప్పేవారు. ఆయన జీవితంపై 'రాజా ది గ్రేట్' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిదే. రాజారావు విశిష్టతను తెలుసుకున్న తెనాలి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మానవత వంటి సంస్థలు ఆహ్వానించి సత్కరించాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన మృతి చెందారన్న సమాచారం తెలిసి పలువురు అమరావతి ప్లాట్స్‌లోని ఆయన నివాసానికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. తమ స్వగ్రామమైన యడ్లపల్లిలో ఈ నెల 25వ తేదీన అంత్యక్రియలు జరుగుతాయని రాజారావు కుమారుడు కృష్ణమోహన్ తెలిపారు.


రావులపల్లి రాజారావు (ఫైల్)

# పెళ్లి చేసుకోకుంటే చంపుతానని బెదిరింపులు

- యువతి ఇంటికి వెళ్లి చాకుతో దాడికి యత్నం
- అడ్డుకోబోయిన ఆమె తల్లిపై దాడి
- స్థానికులు పట్టుకొని స్టేషన్‌లో అప్పగింత
- యువకుడిపై కేసు నమోదు

**కొల్లూరు:** ఓ యువతి పట్ల అనుచితంగా వ్యవహరిస్తూ ఆమెను వేధింపులకు గురిచేస్తున్న అధికార టీడీపీకి చెందిన యువకుడి ఆగడాలు వెలుగులోకి వచ్చాయి. యువతి ఇంటికి వెళ్లి చాకుతో బెదిరించడంతోపాటు, దాడికి పాల్పడిన యువకుడ్ని స్థానికులు చాకచక్యంగా పట్టుకొని పోలీసులకు అప్పగించిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొల్లూరుకు చెందిన గూడూరు దామోదరం టీడీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, కొల్లూరుకు చెందిన ఓ నాయకుడి అనుచరుడిగా మెలుగుతున్నాడు. గతంలో జరిగిన పలు గొడవల్లో అతని పాత్ర ఉంది. మండలంలోని బొద్దులూరుపాడుకు చెందిన ఓ యువతి మూడేళ్ల కిందట పదో తరగతి చదువుతున్న సమయంలో ఇన్‌స్టాగామ్ ద్వారా యువకుడికి పరిచయమైంది. అప్పట్లో ఇరువురు చాటింగ్ చేసుకుంటుండటం గమనించిన తల్లిదండ్రులు యువతిని మందలించడంతోపాటు, యువకుడిని హెచ్చరించి వదిలేశారు. ప్రస్తుతం యువతి తమిళనాడు రాష్ట్రంలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యను అభ్యసిస్తుంది. ఈనెల 7న తమ ఇంట్లో ఫంక్షన్ ఉండటంతో యువతి స్వగ్రామం వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న యువకుడు శనివారం రాత్రి యువతి ఇంటి వెనుక నుంచి గోడ దూకి లోపలకి ప్రవేశించాడు. వరండాలో కూర్చుని ఫోన్ చూసుకుంటున్న యువతి వద్దకు వెళ్లి ఆమె చెయ్యి పట్టుకొని ఇంటి వెనుకవైపు ప్రహరీ వద్దకు లాక్కుని వెళ్లి తనను పెళ్లి చేసుకోవడానికి అంగీకరించని పక్షంలో తాను చనిపోతానని తన ఎడమ చేతిపై చాకుతో కోసుకుని యువతిపై దాడికి యత్నించాడు. ఈ వ్యవహారాన్ని గమనించి యువతి నాయనమ్మ కేకలు వేయడం ప్రారంభించింది. అప్రమత్తమైన యువతి తల్లి అందుబాటులో ఉన్న చీపురుతో నిందితుడు చాకు పట్టుకున్న చేతిపై కొట్టడంతో చాకు కింద పడిపోయింది. అనంతరం తన కూతురుని అతని బారి నుంచి తప్పించేందుకు యువతి తల్లి ప్రయత్నిస్తుండగా ఆమెపై దాడి చేశాడు. భయంతో కేకలు పెడుతూ పరిగెడుతుండగా పక్కింటిలో ఉన్న యువతి పెదనాన్న కేకలు విని స్థానికులతో కలసి అక్కడకి చేరుకుని నిందితుడ్ని పట్టుకున్నారు. నిందితుడ్ని కొల్లూరు పోలీసులకు అప్పగించారు. అనంతరం యువతి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ జి.ఏడుకొండలు తెలిపారు.

# ఘనంగా సాగర్‌మాత దేవాలయంలో పతాకావిష్కరణ

**విజయపురిసౌత్:** స్థానిక సాగర్‌మాత దేవాలయంలో ఆదివారం గుంటూరు పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య చేతుల మీదుగా సాగర్‌మాత పతాకావిష్కరణ ఘనంగా జరిగింది. ముందుగా ఆలయంలో నవదిన జపములు, దివ్య బలిపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాల మధ్య పతాకాన్ని ఆవిష్కరించారు. తదుపరి ఆలయ ప్రాంగణంలో భక్తులు, విచారణ గురువులు స్తోత్ర గీతాలతో తేరు ప్రదక్షిణ చేశారు. పీఠాధిపతులు డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య మాట్లాడుతూ వచ్చే నెల 7 నుంచి 9వ తేదీ వరకు సాగర్‌మాత మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 26 నుంచి వచ్చే నెల 6వ తేది వరకు ప్రతిరోజూ ఉదయం 5.30 గంటల నుంచి నవదిన జపములు, దివ్యబలిపూజా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. 26వ తేదీ మరియమాతకు గాబ్రియేలు సందేశం, 27వ తేదీ ఎలిశబేతమ్మ ఇంటిలో మరియతల్లి, 28వ తేదీ కానాను విందులో మరియతల్లి, మార్చి 1వ తేదీ శిలువ చెంత మరియ, 2వ తేదీ కుటుంబాల రాజ్ఞి, 3వ తేదీ దైవ వరప్రసాదముల మాత, 4వ తేదీ సాగర్‌మాత-సహాయ మాత, 5వ తేదీ ఆరోగ్య ప్రదాయిని, 6వ తేదీ మరియ-వాగ్దత్త వందనం వంటి నవదిన ప్రార్థనలు జరుగుతాయని భాగ్యయ్య తెలిపారు. కార్యక్రమంలో సాగర్‌మాత ఆలయ విచారణ గురువులు జోసఫ్ బాలసాగర్, ఫాదర్ అన్నెం జోసఫ్ తంబి, ఆలయ పెద్దలు దుగ్గెంపూడి ఇన్నారెడ్డి, జక్కిరెడ్డి చిన్నపరెడ్డి, శౌరిరాజు, ఆలేటి మరియదాసు, శౌరిబాబు, కట్టారాజు, చందు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గుంటూరు పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య

# ముగిసిన జిల్లా స్థాయి వాలీబాల్ కబడ్డీ పోటీలు

**పెదకూరపాడు:** పెదకూరపాడులో జిల్లాస్థాయిలో జరిగిన వాలీబాల్, కబడ్డీ, 100 మీటర్ల పరుగు పందెం, షాట్ పుట్ ఆటల పోటీలు ముగిసినట్లు జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు ఆదివారం తెలిపారు. నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో జనచైతన్య సమితి ఆధ్వర్యంలో పెదకూరపాడులోని జీఆర్‌సీఆర్‌కే శ్రీ చైతన్య స్పోర్ట్స్ అకాడమీ క్రీడా ప్రాంగణంలో జరిగిన పోటీలలో విజేతల వివరాలను వివరించారు. వాలీబాల్ పోటీలలో పెదకూరపాడుకు చెందిన జీఆర్‌సీఆర్‌కే శ్రీ చైతన్య స్పోర్ట్స్ అకాడమీ జట్టు ప్రథమ విజేతగా నిలవగా మేడికొండూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన జట్టు ద్వితీయ స్థానం సాధించిందన్నారు. కబడ్డీ పోటీలలో పెదకూరపాడుకు చెందిన టీం ప్రథమ స్థానంలోను, జీఆర్‌సీఆర్ కె శ్రీ చైతన్య స్పోర్ట్స్ అకాడమీ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. 100 మీటర్ల మహిళల పరుగు పందెంలో హస్నిక ప్రథమస్థానంలో, వాగ్దేవి ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. షాట్‌పుట్ పోటీల్లో జ్యోతి ప్రథమ, కావ్య ద్వితీయ, దీక్షిత తృతీయ స్థానంలో నిలిచారన్నారు. పురుషుల విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో సూర్య ప్రథమ స్థానం, ఆశిక్ ద్వితీయ, బాలాజీ తృతీయ విజేతలుగా నిలిచినట్లు తెలిపారు. షాట్‌పుట్ పోటీలలో వెంకట్ ప్రథమ, సూర్య ద్వితీయ, బ్రహ్మం తృతీయ విజేతలుగా నిలిచారని తెలిపారు. విజేతలకు తహసీల్దార్ నీలి ధనలక్ష్మి, నెహ్రూ యువ కేంద్రం ప్రశంసాపత్రాలతోపాటు షీల్డ్‌లను అందజేశారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ గుత్తా రాము, ప్రిన్సిపల్ గుత్తా కవిత, విలేజి రెవెన్యూ అధికారులు శ్రీకాంత్ జాన్ సైదా తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు, షీల్డ్‌లు అందజేస్తున్న తహసీల్దార్ నీలి ధనలక్ష్మి

# శ్రమ దోపిడీ చేస్తున్న బ్యాంకులు

- మార్చి 24, 25వ తేదీల్లో జరిగే సమ్మెను జయప్రదం చేయండి
- బ్యాంక్ ఉద్యోగులకు ఏఐబీఈఏ పిలుపు

**కొరిటిపాడు(గుంటూరు):** బ్యాంకుల్లో స్వీపర్ కేడర్ క్రమంగా కనుమరుగు అవుతోందని అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి బీఎస్ రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. సబార్డినేట్ కేడర్ ఉద్యోగాలలో అతి తక్కువ వేతనాలతో తాత్కాలిక ఉద్యోగులను నియమించి బ్యాంకులు శ్రమ దోపిడీ చేస్తున్నాయన్నారు. గుంటూరు నగరంలో రెండు రోజులుగా జరుగుతున్న ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్(ఏపీ, తెలంగాణ) వర్కింగ్ కమిటీ సమావేశాలు ఆదివారం ముగిశాయి. రాంబాబు మాట్లాడుతూ క్లరికల్ స్టాఫ్ సంఖ్యను కూడా బ్యాంకులు తగ్గిస్తూ వస్తున్నాయన్నారు. బ్యాంకుల్లో సుమారు లక్ష క్లరికల్ ఖాళీలు ఉన్నాయని వెల్లడించారు. బ్యాంకులన్నీ అవార్డ్ స్టాఫ్ కేడర్‌లలో నియామకాలు తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. 2010 తర్వాత బ్యాంకుల్లో చేరిన వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. మార్చి 24, 25వ తేదీల్లో రెండు రోజులు జరిగే సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేఎల్ యూనివర్సిటీ లా కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రంగయ్యలు ఇండస్ట్రీయల్ కోడ్ గురించి వివరించారు. విజయవాడ సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ దివాకర్‌బాబు మాట్లాడారు.


మాట్లాడుతున్న ఏఐబీఈఏ కార్యదర్శి రాంబాబు

# వసతి గృహం ప్రిన్సిపాల్, సిబ్బందికి మెమోలు

**సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా కో–ఆర్డినేటర్ పద్మజ తనిఖీలు**

**రేపల్లె రూరల్:** విధి నిర్వహణలో అలసత్వం వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల, కళాశాలల వసతి గృహంలోని ప్రిన్సిపాల్‌తోపాటు మరో 17 మందికి మెమోలు జారీ చేసినట్లు సాంఘిక సంక్షేమశాఖ జిల్లా కో-ఆర్డినేటర్ పద్మజ తెలిపారు. ఆదివారం పాఠశాల, కళాశాల వసతి గృహాన్ని ఆమె సందర్శించి సిబ్బందిని విచారించారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించి సిబ్బంది నిర్లక్ష్య ధోరణిపై చేసిన ఫిర్యాదుపై తనిఖీలకు వచ్చామన్నారు. వసతి గృహంలోని ఉద్యోగుల మధ్య సమన్వయలోపం, నిర్లక్ష్య ధోరణి ఉన్నాయన్నారు. చిన్నపాటి సమస్యలను పరిష్కరించటంలో ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. ఇప్పటికే ప్రిన్సిపాల్‌తోపాటు హెల్త్ సూపర్‌వైజర్, 16 మంది హౌస్‌మదర్‌లకు మెమోలు అందజేశామన్నారు. ప్రిన్సిపాల్‌కు మెమోతోపాటు శాఖాపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ప్రిన్సిపాల్‌తోపాటు ఇతర ఉద్యోగులను విచారించి వివరాలు సేకరించారు. వసతిగృహం పరిసరాలు, మరుగుదొడ్లు పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు.


వసతి గృహం ప్రిన్సిపాల్‌ను విచారిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా కోఆర్డినేటర్ పద్మజ

# ఉత్తమ కళా రూపాలకు సత్కారాలు

**నరసరావుపేట రూరల్:** కోటప్పకొండ తిరునాళ్లలో మంచి కళారూపాలు ప్రదర్శించిన వారికి సత్కారాలు, బహుమతులు అందజేయనున్నట్లు మంచి చిత్రాల అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈదర గోపిచంద్ ఆదివారం ఒక ప్రకటనలతో పేర్కొన్నారు. తిరునాళ్లలో ప్రభలపై అశ్లీల డ్యాన్స్‌లకు, పాటలకు తావివ్వకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలను అవమానిస్తూ, యువత పెడద్రోవ పట్టే విధంగా తిరునాళ్లలో ప్రదర్శించే అసభ్యకర డ్యాన్స్‌లకు వ్యతిరేకంగా 37 సంవత్సరాలుగా ప్రజాసంఘాల న్యాయపోరాటం ఫలితంగా కొంతమార్పు వచ్చిందని తెలిపారు. ఐదేళ్లుగా సినీఆర్కెస్ట్రా పేరుతో మహిళా డ్యాన్సర్లతో ప్రదర్శించడం పట్ల విచారం వ్యక్తం చేశారు. తిరునాళ్లలో పౌరాణిక పద్యనాటకాలు, కోలాటాలు, శాస్త్రీయ నృత్యాలు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, ఏకపాత్రాభినయాలు, తోలుబొమ్మలాటలు, చెక్క భజనలు, హరికథ, బుర్రకథ, సినిమా పాటల కచేరీలు నిర్వహించే వారిని గుర్తించి సత్కరిస్తామని తెలిపారు. సమాజానికి మేలుచేసే సంప్రదాయ కళారూపాలు ప్రదర్శించే వారు 9440345494 సంప్రదించి మంగళవారంలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.